
నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల


### జిల్లాల వారీగా పట్టభద్రుల ఓటర్ల వివరాలు

| జిల్లా | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 4,297 | 1,840 | – | 6,137 |
| మంచిర్యాల | 19,041 | 11,880 | – | 30,921 |
| ఆదిలాబాద్ | 10,323 | 4,612 | – | 14,935 |
| నిర్మల్ | 11,497 | 5,644 | – | 17,141 |
| నిజామాబాద్ | 19,993 | 11,581 | – | 31,574 |
| కామారెడ్డి | 11,616 | 4,793 | 1 | 16,410 |
| జగిత్యాల | 21,667 | 13,614 | – | 35,281 |
| పెద్దపల్లి | 19,008 | 12,028 | 1 | 31,037 |
| కరీంనగర్ | 42,806 | 28,739 | – | 71,545 |
| సిరిసిల్ల | 13,772 | 8,625 | – | 22,397 |
| సంగారెడ్డి | 17,383 | 8,269 | – | 25,652 |
| మెదక్ | 8,879 | 3,593 | – | 12,472 |
| సిద్దిపేట | 21,587 | 11,002 | – | 32,589 |
| హనుమకొండ | 3,162 | 1,423 | – | 4,585 |
| భూపాలపల్లి | 1,734 | 749 | – | 2,483 |
| మొత్తం | 2,26,765 | 1,28,392 | 2 | 3,55,159 |

# ష్.. గప్‌చుప్!



- ముగిసిన 'ఎమ్మెల్సీ' ప్రచారం
- రేపే పోలింగ్.. ఏర్పాట్లు పూర్తి
- 15 జిల్లాల్లో 773 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల నిర్వహణకు 4,199 మంది సిబ్బంది వినియోగం

**పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని నియమించింది.**

కరీంనగర్, ఫిబ్రవరి 25, (నమస్తే తెలంగాణ ప్రతినిధి/కలెక్టరేట్) : కరీంనగర్– ఆదిలాబాద్– మెదక్– నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి స్థానాల ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. 15 రోజులుగా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేయగా, మంగళవారం సాయంత్రం నుంచి అంతా గప్‌చుప్ అయింది. ప్రచారం ముగిసినా అభ్యర్థులు తమ గెలుపు కోసం చివరి అవకాశాన్ని సైతం సద్వినియోగం చేసుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. బహిరంగ ప్రచారం వీడి, అంతర్గతంగా ఓట్లు అభ్యర్థించే పనుల్లో బిజీ అయ్యారు. పట్టభద్రుల స్థానం నుంచి 56 మంది, ఉపాధ్యాయ స్థానం నుంచి 15 మంది పోటీ పడుతుండగా, ఈ రెండు స్థానాలకు రేపే (గురువారం) పోలింగ్ జరగనుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. పోలింగ్‌కు అవసరమైన సామగ్రి ఇప్పటికే జిల్లాలకు చేరగా, నేడు ఆయా జిల్లాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల సెగ్మెంట్‌కు సంబంధించి 3,55,159 మంది ఓటర్లు, ఉపాధ్యాయ సెగ్మెంట్‌లో 27,088 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా 15 జిల్లాల పరిధిలోని 271 మండలాల్లో మొత్తం 773 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 4,199 మంది సిబ్బందిని పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సంఘం నియమించింది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా 394 మంది మైక్రో అబ్జర్వర్లు, 335 మంది జోనల్ అధికారులు, 864 మంది ప్రిసైడింగ్, 2,606 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి మండల కేంద్రంతోపాటు మున్సిపాలిటీల్లో అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా 15 జిల్లాల్లో కలిపి 499 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఉపాధ్యాయుల కోసం 274 సిద్ధం చేశారు. ఈ కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కంట్రోల్ రూంకు అనుసంధానించారు. గ్రాడ్యుయేట్లు, టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రం వివరాలతో కూడిన స్లిప్పులు కూడా పంపిణీ చేశారు. సామగ్రి పోలింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు రూట్ మ్యాప్‌లు కూడా సిద్ధం చేశారు. ఒక్కో జిల్లాలో ఉన్న పోలింగ్ కేంద్రాలను బట్టి రూట్లుగా విభజించారు. రూట్ అధికారులను నియమించి వారికి పోలింగ్ సామగ్రితో పాటు సిబ్బందిని కేంద్రాలకు చేరవేసే బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఉదయం నుంచే జిల్లా కేంద్రాల నుంచి పీఎస్‌లకు సామగ్రి పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందించి, అందుకనుగుణంగా పంపిణీ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది చేరుకునేలా రిటర్నింగ్ అధికారి ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు బుధవారమే చేసుకోవాలని ఎన్నికల అధికారులు పోలింగ్ సిబ్బందికి సూచించారు. పోలింగ్ అనంతరం అదేరోజు బ్యాలెట్ బాక్సులను రిసీవింగ్ సెంటర్లకు తెచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశారు. అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు ఓట్ల లెక్కింపు కేంద్రమైన కరీంనగర్‌లో అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేలా పటిష్ట ఏర్పాట్లు చేశారు.

### జిల్లాలు, మండలాల వారీగా పట్టభద్రులు, ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాల వివరాలు

| జిల్లా | మొత్తం మండలాలు | గ్రాడ్యుయేట్స్ పోలింగ్ స్టేషన్లు | టీచర్స్ పోలింగ్ స్టేషన్లు |
|---|---|---|---|
| అసిఫాబాద్ | 15 | 16 | 15 |
| మంచిర్యాల | 18 | 40 | 18 |
| ఆదిలాబాద్ | 18 | 27 | 18 |
| నిర్మల్ | 19 | 27 | 19 |
| నిజామాబాద్ | 33 | 48 | 33 |
| కామారెడ్డి | 25 | 29 | 25 |
| జగిత్యాల | 20 | 51 | 20 |
| పెద్దపల్లి | 14 | 36 | 14 |
| కరీంనగర్ | 16 | 85 | 18 |
| రాజన్న సిరిసిల్ల | 13 | 28 | 13 |
| సంగారెడ్డి | 28 | 40 | 28 |
| మెదక్ | 21 | 22 | 21 |
| సిద్దిపేట | 22 | 40 | 23 |
| హనుమకొండ | 4 | 5 | 4 |
| భూపాలపల్లి | 5 | 5 | 5 |
| మొత్తం | 271 | 499 | 274 |

# ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ!

- కేసీఆర్ సర్కారు హయాంలో ఉమ్మడి జిల్లాలో వేలాది కోట్లతో అభివృద్ధి
- రైతన్నను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు
- కోట్లాది నిధులతో విద్యుత్ రంగం బలోపేతం
- ప్రాజెక్టుల నిర్మాణంతో తీరిన సాగునీటి కష్టాలు
- విద్య, వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులు



**కరీంనగర్– ఆదిలాబాద్– మెదక్– నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈసారి ఉత్కంఠ రేపుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోటీ నెలకొనగా, సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్నాయి. జాతీయ పార్టీ అయిన బీజేపీ ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకొని, తన శ్రేణులను బరిలోకి దింపి విస్తృత ప్రచారం చేయించింది. పీఆర్టీయూ నుంచి బరిలో ఉన్న వంగ మహేందర్‌రెడ్డి, అలాగే మిగతా అభ్యర్థులు కూడా ఎలాగైనా గెలువాలనే లక్ష్యంతో సర్వప్రయత్నాలు చేస్తుండడం కనిపిస్తున్నది. మొత్తంగా ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తుండగా, వచ్చే వారంలో గెలుపెవరిదో తేలనున్నది.**

కరీంనగర్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు ఈ సారి ఉత్కంఠ రేపుతున్నది. బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులుండగా.. అందులో ఇద్దరు ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ కనిపిస్తున్నది. అయితే ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలని ఆయా అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. 2019లో జరిగిన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పుడు 23,214 మంది ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. ప్రస్తుతం ఆ సంఖ్య 27,088కి చేరింది. అంటే ఈ సారి 3,874 మంది ఉపాధ్యాయులు కొత్తగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. అందులో 16,932 మంది పురుషులు, 10,156మంది మహిళా ఓటర్లున్నారు. అత్యధికంగా కరీంనగర్‌లో 4,305 మంది, నిజామాబాద్‌లో 3,751 మంది, సిద్దిపేటలో 3,212 మంది ఉన్నారు. అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 83 ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. హనుమకొండ జిల్లాలో 166 ఓట్లు, ఆసిఫాబాద్‌లో 470 ఓట్లు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 950 ఓట్లున్నాయి.

### ఎవరి ధీమా వారిదే?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఈ సారి గతానికి భిన్నంగా ప్రచారం చేశారు. సామాజికవర్గాల వారీగా సాగించారు. బీసీ నినాదం ఈసారి ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయనే ప్రచారం సాగుతున్నది. రాష్ట్రంలోని బీసీ కుల గణనపై చర్చ జరు గుతున్న నేపథ్యంలో సామాజిక వర్గాల వారీగా ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వ హిస్తూ గెలుపునకు ప్రయత్నాలు చేశారు. 15జిల్లాల పరిధిలో ఈ ఎన్నిక జరుగుతుండగా, బరిలో 15 మంది బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్పీసీ సంఘాల మద్దతుతో అశోక్ కుమార్, ఎస్టీయూ, మోడల్ స్కూల్, కేజీబీవీ, సీపీఎస్ సంఘాల మద్దతుతో ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి బరిలో ఉండి.. తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. మరి కొంత మంది సైతం తమ ప్రచారాన్ని చాపకింద నీరులా సాగిస్తున్నారు. పార్టీ నుంచి బరిలోకి దింపిన బీజేపీ ఈసారి ఎన్నికను తన ప్రతిష్టకు సవాలుగా తీసుకున్నట్టు కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే కొమురయ్యను రంగంలోకి దింపిన ఆ పార్టీ గెలుపు కోసం తన అస్త్రశస్త్రాలను వినియోగిస్తున్నది. ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటుచేసి, ప్రైవేట్ పాఠశాలల్లో పకడ్బందీగా ప్రచారం చేస్తూ.. సదరు ఓటర్లను ఆకట్టుకోవడమే కాకుండా మెజార్టీ ప్రభుత్వ టీచర్లను తమవైపు తిప్పుకొన్నట్టు ప్రచారం జరుగుతున్నది. అంతేకాదు, ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆ పార్టీ.. ప్రస్తుతం బీజేపీ మొత్తం యంత్రాంగాన్నిసైతం రంగంలోకి దింపింది. ఈ నేపథ్యంలో గెలుపుపై ప్రధాన ధీమాను వ్యక్తం చేస్తున్నది. ఉపాధ్యాయ సంఘాల్లో అతి పెద్ద యూనియన్ అయిన పీఆర్టీయూ.. మహేందర్‌రెడ్డి గెలుపు కోసం సర్వశక్తులను ఒడ్డుతున్నది. అయితే కూర రఘోత్తంరెడ్డి చూపించే ప్రభావం ఈ యూనియన్‌పై పడే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతున్నది. ఇదే సమయంలో మిగతా అభ్యర్థులు.. గెలుపు కోసం చివరి వరకు తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందన్న దానిపై రకరకాల చర్చలు సాగుతుండగా, గెలుపుపై ఎవరిధీమా వారే వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు

| జిల్లా | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 325 | 145 | 470 |
| మంచిర్యాల | 999 | 665 | 1664 |
| ఆదిలాబాద్ | 1095 | 498 | 1593 |
| నిర్మల్ | 1282 | 684 | 1966 |
| నిజామాబాద్ | 2176 | 1575 | 3751 |
| కామారెడ్డి | 1307 | 704 | 2011 |
| జగిత్యాల | 1232 | 537 | 1769 |
| పెద్దపల్లి | 647 | 464 | 1111 |
| కరీంనగర్ | 2663 | 1642 | 4305 |
| సిరిసిల్ల | 677 | 273 | 950 |
| సంగారెడ్డి | 1520 | 1170 | 2690 |
| మెదక్ | 799 | 548 | 1347 |
| సిద్దిపేట | 2020 | 1192 | 3212 |
| హనుమకొండ | 126 | 40 | 166 |
| భూపాలపల్లి | 54 | 19 | 83 |
| మొత్తం | 16932 | 10156 | 27088 |



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

# హామీల అమలేది?

- పదిహేను నెలలైనా జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదు
- కేసీఆర్ ఇచ్చిన పోస్టులను మీరే ఇచ్చినట్టు చెప్పుకొంటారా?
- కాంగ్రెస్ తీరుపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

జగిత్యాల, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదిహేను నెలలైనా ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని, జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఎందుకు గెలిపించాలని నిలదీశారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి పదిహేను నెలలు గడిచిందని గుర్తు చేశారు. కేసీఆర్ ఇచ్చిన 30 వేల ఉద్యోగాల నోటిఫికేషన్ అనుమతి పత్రాలను అందించి, అవి వారే ఇచ్చినట్టు కాంగ్రెస్ చెప్పుకుంటున్నదని మండిపడ్డారు. ఇంతకంటే మోసం, దగా ఉంటుందా? అని గ్రాడ్యుయేట్స్ పక్షాన, బీఆర్ఎస్ తరపున ప్రశ్నిస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించనందుకా..? డబ్బులున్న అభ్యర్థులను పెట్టినందుకా..? ఎందుకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సభకు ఒక సీఎం వచ్చి ఓటు వేయాలని కోరిన చరిత్ర గతంలో లేదని ఎద్దేవా చేశారు. మంత్రులంతా ఎవరికి వారే ముఖ్యమంత్రులుగా ఫీల్ అవుతున్నారని, కాంగ్రెస్, బీజేపీని నమ్ముకున్న అభ్యర్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులకే హవా ఉందని, ఈ ఫలితాలు బీజేపీ, కాంగ్రెస్‌కు చెంప పెట్టులాగా ఉంటాయన్నారు. బీజేపీతో తమకు సంబంధం లేదని, తమది స్వయం ప్రతిపత్తిని కలిగిన పార్టీ అని, రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానంగా బీఆర్ఎస్ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, వైస్ చైర్మన్ ఒద్దినేని హరి చరణ్‌రావు, తదితరులున్నారు.

# పొలం.. పశువులకు మేత

- ముస్తాబాద్ మండలంలో సాగునీటి గోస
- పంట ఎండుతుండడంతో మేకలు, పశువులకు వదిలేస్తున్న రైతులు



సేవాలాల్‌తండాలో నీరులేక ఎండుతున్న వరి చేనులో మేస్తున్న మేకలు

ముస్తాబాద్, ఫిబ్రవరి 25: రైతన్నకు సాగు నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. చెరువులు, కుంటల్లో నీళ్లు లేక, ప్రాజెక్టుల నుంచి నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయి. ముస్తాబాద్ మండలంలో యాసంగి తొలి దశలో బోరు బావుల్లో సమృద్ధిగా నీరు ఉండడం, మల్లన్నసాగర్ నుంచి చెరువులు, కుంటలకు నీరు వస్తుందని, నక్కవాగులో నీరు ప్రవహిస్తే సమీప గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని ధీమాతో రైతులు అప్పులు చేసి పంటలు వేశారు. కానీ, రిజర్వాయర్ నుంచి నీరు రాకపోవడం, వేసవి ముదరక ముందే బావులు, బోర్లు అడుగంటిపోవడంతో సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పంటను కాపాడుకునేందుకు పలువురు రైతులు బోర్లు వేయిస్తున్నా పెద్దగా ప్రయోజనం లేక ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో సేవాలాల్‌తండాలో రైతు రవినాయక్ తన వరిలో పశువులను మేపుతున్నాడు. అలాగే కౌలు రైతు వసంతనాయక్ నాలుగెకరాలు సాగు చేసినా బోరులో నీళ్లు ఎల్లక సగం వరిని మేకలకు మేతగా వదిలేశాడు. ఇలా ఈ ఒక్క గ్రామంలోనే కాదు ఎక్కడ చూసినా రైతులు సాగు నీటి కోసం అరిగోస పడుతున్నారు.



సేవాలాల్‌తండాలో నీరులేక ఎండిన పొలంలో గేదెలను మేపుతున్న రైతు రవినాయక్


# మహాశివరాత్రి శోభ

- నేడు పర్వదినం
- వేములవాడలో ఉత్సవాలు మొదలు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం, విప్ ఆది



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తీసుకవస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 25 : నేటి మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. మంగళవారం రాత్రి నుంచే రంగురంగుల విద్యుద్దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. వేములవాడ రాజరాజేశ్వ క్షేత్రంలో మూడు రోజుల ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్.. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం.. శృంగేరి పీఠం తరపున పీఠాధిపతి శిష్యుడు రాధాకృష్ణ రాజన్నకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం మంత్రి, విప్ ఆలయ పార్కింగ్ స్థలంలోని శివార్చన సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుండగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గట్టిపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సాయంత్రం 6 నుంచి 9 గంటలవరకు బ్రాహ్మణ అనువంశిక కుటుంబాల అర్చకులచే మహాలింగార్చన, రాత్రి 11 గంటలకు లింగోద్భవకాలంలో స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహిస్తారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ బుధవారం స్వామివారిని దర్శించుకుంటారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

# సైనికుల్లా ముందుకుసాగాలి

### బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు

గోదావరిఖని, ఫిబ్రవరి 25: ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ విశ్వాసం కోల్పోయిందని, కలిసికట్టుగా పనిచేస్తే భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని మాజీ ఎమ్మెల్యే, పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. పార్టీ గెలుపే లక్ష్యంగా గులాబీ సైనికులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని పట్టణంలోని మార్కండేయకాలనీలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ రామగుండం నియోకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది గులాబీ జెండా అని, ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాక్షేత్రంలో తీసుకోవాల్సిన అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు, శ్రేణులతో సుదీర్ఘంగా చర్చించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు మూల విజయారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ పాల్గొన్నారు.





























